సంపుటి: 4 | సంచిక: 1
నవంబర్ - డిసెంబర్, 2015

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

క్రిస్మస్
మరియు
నూతన సంవత్సర
శుభాకాంక్షలు





# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

ప్రభువునందు ప్రియులైన స్పర్శ పాఠకులకు శుభములు. మనలను ఆయన కృప ద్వారా పది నెలలు కాపాడి, సంవత్సరపు చివరి సమయములోనికి నడిపించడం జరిగింది. మరియొక సంవత్సరములోనికి ప్రవేశించే ముందు మన జీవితములో ఉన్న బలహీనతలు మనం గుర్తించి వాటిలో జయం పొందుటకు ప్రయత్నం చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది.

నేను పిల్లవాడనైయున్నప్పుడు పిల్లవాని వలె మాటలాడితిని, పిల్లవాని వలె తలంచితిని, పిల్లవాని వలె యోచించితిని. ఇప్పుడు పెద్దవాడనై పిల్లవాని చేష్టలు మానివేసితిని. – 1 కొరింథీ 13:11

పౌలు తాను ఒకప్పుడు ఏ విధంగా మాట్లాడాడో, ఏ విధంగా తలంచాడో గుర్తు తెచ్చుకొని, ఆ సమయములో తాను చిన్నవాడిని అని చెప్పుచున్నది వయసులో కాదు, ఆత్మీయతలో. కనుక దేవుని యందు విశ్వసించి జీవిస్తున్న ప్రతి ఒక్కరు తమ జీవితములలో ఏ విషయములలో తమ మాటలను, ఆలోచనలను మెరుగుపరచుకోవాలో గ్రహించి ముందుకు వెళ్లుట ద్వారా ఎంతో అభివృద్ధి చెందగలుగుతారు. ఆలాగున పౌలు తన జీవితములో గ్రహించి క్రమక్రమముగా దేవునికి ఉపయోగపడే సాధనంగా తనని తాను సిద్ధపరచుకోవడం జరిగింది. దేవుని కొరకు ప్రయోజనకరమైన వాడు సమాజం కొరకు, కుటుంబం కొరకు కూడా ప్రయోజనకరంగా ఉంటాడు. మన జీవితములో ఇంకా మార్పుచెందవలసిన విషయములను గుర్తించి దేవుని సహాయముతో మనలను మనము సరిచేసుకొనుట ద్వారా మరియొక సంవత్సరము అంతా మన జీవితములలో ఆశీర్వాదకరముగా ఉండుటకు సిద్ధపడదాం.

అట్టి ధన్యత ప్రభువు మనకు దయచేయును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 4 | సంచిక: 1

నవంబర్ - డిసెంబర్, 2015

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- దేవుని నీతి ...... 2
- సర్వలోక క్షేమము ...... 5
- నోటి మాటలు (స్త్రీల ప్రత్యేకం) ...... 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 43వ భాగము ...... 10
- నిజ స్నేహితుడు(True Friend) (బాలల శీర్షిక) ...... 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ...... 14
- సత్యము ...... 16
- ప్రార్థనా శక్తి ...... 20
- బైబిల్ క్విజ్-43 ...... 22
- జన్మదిన శుభాకాంక్షలు ...... 23


మా చిరునామా :

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227

# దేవుని నీతి

- బ్రదర్. ఎపఫ్రా

నీతి అనే మాటకు అనేకమైన అర్థములను చెప్పుకుంటూ లోకం ముందుకి వెళుతుంది. లోకం నుండి ప్రత్యేకపరచబడ్డాము అని చెప్పుకుంటున్న క్రైస్తవులుగా నీతిని గురించి ఎలాంటి అవగాహన కలిగి ఉన్నాము? మనలో అనేకులు కలిగి ఉన్న అవగాహన, నేను యేసుప్రభువుని నమ్ముకొని త్రాగుడు మానివేశాను, సిగిరెట్లు కాల్చట్లేదు, చెడ్డపనులన్నీ చేయడం విడిచిపెట్టాను అని చెప్పుకుంటూ, సాక్ష్యములు ఇస్తూ ఎంతో మురిసిపోతూ ఉంటారు. ఇవన్నీ మంచివే కానీ, వీటన్నిటి కంటే ఎంతో ఉన్నతమైన స్థాయిలో ఉంది దేవుని నీతి.

**రోమా 3:20**లో వ్రాయబడినట్లుగా **ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు.** ధర్మశాస్త్రసంబంధమైన క్రియల విషయంలో అనేకులు జాగ్రత్త కలిగి ఉండడం సాధారణమైన విషయం. దేవుని నీతి దీనికి భిన్నమైనదిగా మనకి కనబడుచున్నది. **రోమా 10:4** ప్రకారము **విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై, క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు.** ఇచ్చట దేవుని నీతి ఆయన యందలి విశ్వాసము అని మనకి స్పష్టముగా అర్థమవుచున్నది. ఈ సందర్భములో బైబిలు గ్రంథం నందు ఉన్న ఒక వ్యక్తి యొక్క జీవితం చక్కటి ఉదాహరణగా చెప్పుకోవచ్చును. యేసుక్రీస్తు భూమి మీద సేవ చేసిన దినములలో ఒక వ్యక్తి ఆయన యొద్దకు వచ్చి, పరలోకరాజ్యములో ప్రవేశించాలంటే నేను ఏ ఏ నీతి క్రియలు చేయాలి అని అడిగి, ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు బాల్యము నుండి నేను అనుసరిస్తున్నాను అని చెప్పాడు. అప్పుడు ప్రభువు నీకు ఒకటి కొదువగా ఉన్నది, నీ ఆస్థిని అమ్మి, బీదలకిమ్ము అని చెప్పడం జరిగింది. ఆ మాట విని ముఖమును చిన్న బుచ్చుకుని వ్యసనపడుతూ వెళ్ళాడు. ధర్మ శాస్త్రమంతయు నెరవేర్చుచున్న వ్యక్తి విశ్వాస సంబంధ మైన కార్యం విషయంలో వెనకడుగువేసాడు. ఆస్థిని అమ్మి బీదలకు ఇవ్వడం అనేది విశ్వాస సంబంధమైన కార్యము. ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతి బయలు పడు చున్నది, దానికి ధర్మశాస్త్రమును, ప్రవక్తలును సాక్ష్య మిచ్చుచున్నారు. అది యేసుక్రీస్తు నందలి విశ్వాస మూలమైనదై నమ్మువారందరికి కలుగు దేవుని నీతియై యున్నది. **(రోమా 3:21, 22)**



రేపటిని గురించి చింత కలిగి జీవించడం, భవిష్యత్‌ను గురించి ఆందోళనపడడం ఖచ్చితంగా విశ్వాస సంబంధమైన దేవుని నీతికి విరోధమైనది. వీటినే మనం దుర్నీతి అని చెప్పుకోవచ్చును. మన బలహీనతలలో, అపజయములలో మనలను బట్టి మనము క్రుంగిపోవడం దుర్నీతిగా దేవుడు భావిస్తాడు. విశ్వాసమును కనపరచడం దేవుని నీతి అవుతుంది.

<u>**రాహాబు నీతి :-**</u>

**రాహాబు అనే స్త్రీని గురించి బైబిల్ గ్రంథములో వ్రాయబడిన సంగతులను ధ్యానిద్దాము :-**



ఆమె ఒక వేశ్య. సమాజములో ఆమెను గూర్చి మాట్లాడాలన్నా ఇష్టపడని పరిస్థితులు. యెరికో అనే పట్టణ ప్రాకారము మీద నివసిస్తూ ఉండేది. దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు కానాను దేశ ప్రయాణ ములో యెరికో పట్టణమును దాటి వెళ్ళవలసి వచ్చింది. ఆ సమయంలో ఆ పట్టణమును చూచి వచ్చుటకు యెహోషువ ఇద్దరు వేగుల వారిని పంపగా, వారిని రాహాబు తన ఇంట చేర్చుకుంది. ఇచ్చట ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వారితో ఆమె చెప్పిన విషయములు మన హృదయములను పులకింపచేస్తాయి.

యెహోషువ 2:9,10 ప్రకారము **యెహోవా ఈ దేశమును మీకిచ్చు చున్నాడనియు, మీ వలన మాకు భయము పుట్టుననియు, మీ భయము వలన మా దేశనివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును. మీరు ఐగుప్తు దేశము నుండి వచ్చినప్పుడు, మీ యెదుట యెహోవా యెఱ్ఱసముద్రపు నీరు ఏలాగు ఆరిపోచేసెనో, శత్రువుల మీద ఎలా జయము ఇచ్చెనో మేము వింటిమి. వినినప్పుడు మా గుండెలు కరిగిపోయాయి** అని చెబుతున్న రాహాబు మాటలలో ఎంతో విశ్వాసం కనబడుచున్నది. ఆమె కేవలం వేరొకరి ద్వారా విని విశ్వాసంతో అద్భుతమైన మాటలను చెప్పుచున్నది. ఇశ్రాయేలీయులలో అనేకులను మనము చూచినప్పుడు దేవుని కార్యములను కన్నులారా చూచి సహితము మంచి మాటలు తమ నోట పలకలేక పోయారు. మోషే కానానుకు పంపిన 12 మందిలో 10 మంది ఏ మాత్రమూ విశ్వాసమును కనపరచలేకపోయారు. కానీ ఈ స్త్రీని చూచినప్పుడు వీరి కంటే ఎంతో భిన్నమైనదిగా కనబడుచున్నది. అందుకే దేవుడు ఆమెను అవిధేయులతో పాటు నశించిపోనియ్యక రక్షించాడు.

మనుష్యుని జ్ఞానంతో ఆలోచించినప్పుడు కనిపించే నీతి వేరు, దేవుని యొక్క జ్ఞానముతో ఆలోచించినప్పుడు కనిపించే నీతివేరు.

**<u>పేతురు నీతి :-</u>**



పేతురు యేసుప్రభువు శిష్యులలో తొందరపడే వ్యక్తి వలె కనబడుతూ ఉంటాడు. ప్రభువును సిలువ వేయడానికి సైనికులు పట్టుకొని, ఈడ్చుకుంటూ తీసుకొని వెళ్తున్నప్పుడు పేతురు తప్ప మిగిలిన వారంతా పారిపోయినట్లుగా వ్రాయబడి ఉంది. (మత్తయి 26:56) పేతురు మాత్రం ప్రభువు వెంట ఉండగా అక్కడ ఉన్నవారు గుర్తించి, ఇతను కూడా యేసుతో ఉన్నాడు అని అంటుండగా, భయముతో 3 సార్లు అబద్ధం చెప్పిననూ, ప్రభువును మాత్రం విడిచి వెళ్ళడానికి ఇష్టపడలేదు. ఇచ్చట పేతురులో ఆయన మీద ఉన్న విశ్వాసం కనబడుతుంది. అందుకే తరువాత దినములలో పేతురు బలమైన పనివానిగా దేవుని చేతిలో వాడబడ్డాడు.

ప్రియ చదువరీ! నిజమైన దేవుని నీతిని ఇప్పుడైనా అర్థం చేసుకొనగలుగు చున్నావా? మన అనుదిన జీవితములో విశ్వాసముతో ఆలోచించి, నిర్ణయములు తీసుకొని, పనిచేసే వారిగా ఉండాలి. కొన్ని నీతి పద్ధతులను అనుసరించుట కంటే, విశ్వాసమూలమైన నీతితో జీవించుట ఎంతో అవసరమైనది. ఈ దినములలో ఎందరో తాము అనుకునే నీతిలో జీవిస్తూ, దేవుని ఎదుట దుర్నీతిని కనపరుస్తున్నారు. కనుక అట్టి దుర్నీతిని ద్వేషించి, దేవుడు ఉద్దేశించిన నీతిని ప్రేమించు. అప్పుడు దేవుడు నీ దేవుడు నీ తోడివారికంటే నిన్ను హెచ్చించునట్లుగా ఆనందతైలముతో అభిషేకిస్తాడు (హెబ్రీ 1:9)

అట్టి ధన్యత దేవుడు అనుగ్రహించును గాక !

# సర్వలోక క్షేమము

**వారు కయీను నడిచిన మార్గమున నడిచిరి, - యూదా 1:11** కయీను నడిచిన మార్గమున నడిచే వారి గురించి యూదా చెప్పుచున్నాడు. వారు ఎవరు? వారు తమ సహోదరుల క్షేమాభివృద్ధిని కోరనివారు. కయీను తన తమ్ముడైన హేబేలు విషయములో చేసిన తప్పు ఇదియే. అదే విషయం దేవుడు కూడా చెప్పడం జరిగింది.

**నీవు సత్క్రియ చేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయనియెడల వాకిట పాపము పొంచియుండును; నీ యెడల దానికి వాంఛ కలుగును నీవు దానిని ఏలుదువనెను - ఆది 4:7 లో** ఈ విషయములో మనలను మనము కూడా పరీక్షించుకొనుట ఎంతో ముఖ్యమైనది.

మీ సహవాసములో ఉన్న సహోదరులకు వారి కుటుంబములలో అతి శ్రేష్ఠమైన దేవుని మేలులు జరగాలనే నీవు కోరుచున్నావని నిజాయితీగా చెప్పగలవా? అదే విధంగా ఇతర సహవాసములలో ఉన్న విశ్వాసులకు, అంతే కాక మనుష్యులందరికి ముఖ్యముగా నీకు కీడు చేసిన వారికి కూడా మేలు జరగాలని నీవు కోరుచున్నావా? ఇతరులకు వారి కుటుంబములలో వారికి మేలు జరిగినప్పుడు నీవు సంతోషించడానికి బదులు బాధపడినట్లైతే వారికి కీడు జరిగినప్పుడు నీవు బాధపడుటకు బదులు సంతోషించినట్లైతే ఖచ్చితముగా నీవు కయీను మార్గములో నడుచుచున్నావని అర్థము అవుతున్న విషయం.

తన సహోదరుని విషయములో క్షేమమును కోరకపోయినందున కయీను ముఖము చిన్నబుచ్చుకొని చీకటిలో ఉన్నాడు. **యెహోవా కయీనుతో - నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? ఆది 4:6** మన హృదయములో ఉన్న వైఖరి మన ముఖములో కనిపిస్తూ ఉంటుంది.



మనము అందరి క్షేమమును కోరిన యెడల ప్రభువులో ఉన్న సంతోషము పరిపూర్ణమగుచూ మన ముఖము కాంతిగాను, తేటగాను ఉంటుంది. చాలామంది విశ్వాసులు కయీను మార్గములో నడుచుట ఎంతో దుఃఖకరము. మనుష్యులు మనకు వ్యతిరేకమై కీడు చేసినప్పుడు మన హృదయ స్థితిని దేవుడు గమనిస్తాడు. ఎందుకంటే దేవుని స్వభావము శత్రువులను కూడా ప్రేమిస్తుంది కాబట్టే మనము వారిని ప్రేమించలేనట్లయితే మనము ఇంకా దేవుని స్వభావములోనికి రాలేదు అనేది వాస్తవం. యూదా ఇస్కరియోతుకు కూడా మేలు జరగాలని యేసయ్య కోరుకున్నాడు. ప్రజలందరికి మేలు జరగాలని ప్రభువు కోరుకొనుచున్నాడు. మనము కూడా దేవుని స్వభావములో పాలివారమై అందరి క్షేమమును ఆకాంక్షించి ధన్యులుగా మార్పు చెందుదుము. చివరిగా ఒక్క విషయం, మనము ఏది విత్తుకొనెదమో అదే పంటను కోసుకొనెదము. కనుక అందరి క్షేమమును కోరుకొనుట ద్వారా మనము మన కుటుంబములు క్షేమమును అనుభవించుటకు దేవుడు సహాయం చేయును గాక !

**ముఖ్య గమనిక:**

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.


ప్లాట్ నెం.1, శాంతినగర్, భార్గలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com




**క్రిస్మస్ మరియు**
**నూతన సంవత్సర ఆరాధన**

**క్రిస్మస్ ఆరాధన సమయం:**
డిసెంబర్ 25,
ఉదయం గం. 10.00 లకు

**నూతన సంవత్సర ఆరాధన సమయం:**
డిసెంబర్ 31,
రాత్రి గం. 9.00 లకు

**వివరములకు:**
9666666249, 040-24202227

# నోటి మాటలు

సిస్టర్. విజయ

ఒక విషయమును ఎదుటివారు చెప్పినప్పుడు విని, మాట్లాడటానికి అభిప్రాయములు చెప్పడానికి తొందరపడక, దానిని అన్ని విధములుగా అర్థము చేసుకున్న తరువాత మాట్లాడాలి లేకపోతే అనేకులు గాయపరచబడతారు.

**ఆతురపడి మాటలాడువాని చూచితివా? వానికంటె మూర్ఖుడు సులువుగా గుణపడును. - సామె 29:20** కొందరు ఎదుటి వారి నోరు ఎత్తనివ్వకుండా మాట్లాడేస్తూ ఉంటారు. ఇది ఆతురపడి మాట్లాడే వారి స్వభావం. పరిశుద్ధ లేఖనములు ఆతురముగా మాట్లాడే వ్యక్తిని మూర్ఖుని కంటే హీనముగా పోల్చుతున్నాయి. కనుక ఆలోచించి మాట్లాడాలి. ముఖ్యంగా, కుటుంబసభ్యులతో తోటివారితో మనం ఏ విధంగా మాట్లాడు తున్నాము? అని పరిశీలించుకోవాలి. ప్రాముఖ్యమైన స్థానములలో ఉన్నవారికి ఈ తొందర ఎక్కువగా ఉంటుంది.

బైబిల్ గ్రంథములో నాబాలు అనే వ్యక్తి ఆతురపడి మాట్లాడినవానిగా కనబడుచున్నాడు. దావీదు అరణ్యమందు ఉన్నప్పుడు నాబాలు గొఱ్ఱెల బొచ్చు కత్తెర వేయుచున్నాడని విని, తన పనివారిలో 10 మందిని పిలిచి, నాబాలు నొద్దకు వెళ్ళి, నా పేరు చెప్పి కుశల ప్రశ్నలడిగి, నీకును, నీకు కలిగిన అంతటికిని క్షేమమవును గాక అని పలికి, ఈ వర్తమానమును తెలియజెప్పమనెను. **నీ యొద్ద గొఱ్ఱెలబొచ్చు కత్తిరించు వారున్నారను సంగతి నాకు వినబడెను; నీ గొఱ్ఱెలకాపరులు మా దగ్గరనుండగా మేము వారికి ఏ కీడునుచేసి యుండలేదు; వారు కర్మెలులో నున్నంతకాలము వారేదియు పోగొట్టుకొనలేదు; నీ పనివారిని నీవు అడిగినయెడల వారాలాగు చెప్పుదురు. కాబట్టి నా పనివారికి దయ చూపుము. శుభదినమున మేము వచ్చితిమి గదా; నీకిష్టము వచ్చినట్టు నీ దాసులకును నీ కుమారుడైన దావీదునకును ఇమ్ము. దావీదు పనివారు వచ్చి అతని పేరు చెప్పి ఆ మాటలన్నిటిని నాబాలునకు తెలియజేసి కూర్చుండగా నాబాలు - దావీదు ఎవడు? యెష్షయి కుమారుడెవడు? తమ యజమానులను విడిచి పారిపోయిన దాసులు ఇప్పుడు అనేకులున్నారు. నేను సంపాదించుకొనిన అన్నపానములను, నా గొఱ్ఱెలబొచ్చు కత్తిరించు వారికొరకు నేను వధించిన పశుమాంసమును తీసి, నేను బొత్తిగా ఎరుగని వారి కిత్తునా? అని దావీదు దాసులతో చెప్పగా - I సమూ 25:7-11**

దావీదు పనివారు ఏ విధంగా అడిగారో, నాబాలు యొక్క సమాధానము ఎలా ఉందో ఇక్కడ మనం గమనించగలము. దావీదు నీ పనివారు ఏదియు పోగొట్టుకొనలేదు, వారికి ఏ కీడు కలుగలేదు, వారిని అడిగి నా పనివారి యెడల దయ చూపమని చెప్పిననూ,

నాబాలు ఏమీ ఆలోచించక, తన పనివారితో ఏమీ మాట్లాడక, తొందరపడి ఆత్రముతో చెప్పిన సమాధానం దావీదు కోపమునకు కారణమయ్యింది. అంతట పనివాడు ఒకడు నాబాలు భార్యయైన అబీగయీలుతో ఇట్లనెను. దావీదు అరణ్యములో నుండి, మన యజమానుని కుశల ప్రశ్నలడుగుటకై దూతలను పంపగా, వారితో కఠినముగా మాట్లాడెను, ఆ మనుష్యులు మాకెంతో ఉపకారము చేసియున్నారు. వారి మధ్యను సంచరించుచున్నంత సేపు అపాయము గాని, నష్టముగాని మాకు సంభవింపనే లేదు.

**మేము గొఱ్ఱెలను కాయుచున్నంతసేపు వారు రాత్రింబగళ్లు మాచుట్టు ప్రాకారముగా ఉండిరి. అయితే మా యజమానునికిని అతని ఇంటి వారికందరికిని వారు కీడు చేయ నిశ్చయించి యున్నారు గనుక ఇప్పుడు నీవు చేయవలసినదానిని బహు జాగ్రత్తగా ఆలోచించుము. మన యజమానుడు బహు పనికిమాలినవాడు, ఎవనిని తనతో మాటలాడనీయడు అనెను. - 1 సమూ 25:16,17**

నాబాలు పనివాడు కూడా నాబాలుని పనికిమాలినవాడు, ఎవరిని తనతో మాట్లాడనీయడు అని అంటున్నాడు. ఆతురపడి మాట్లాడే వ్యక్తికి విలువ, అతని మాటలకు గౌరవం ఉండవు. పనివాడు చెప్పిన మాటలను బట్టి నాబాలు భార్య అబీగయీలు జ్ఞానం కలిగినదై దావీదు కోరిన వాటిని సిద్ధపరచుకొని, అతనిని ఎదుర్కొని సాష్టాంగ నమస్కారము చేసి, అతని పాదములు పట్టుకొని ఇట్లనెను.

**నా యేలినవాడా, దుష్టుడైన యీ నాబాలును లక్ష్యపెట్టవద్దు, అతని పేరు అతని గుణములను సూచించుచున్నది, అతని పేరు నాబాలు, మోటుతనము అతని గుణము; నా యేలినవాడు పంపించిన పనివారు నాకు కనబడలేదు. నా యేలినవాడా, యెహోవా జీవముతోడు నీ జీవముతోడు ప్రాణహాని చేయకుండ యెహోవా నిన్ను ఆపియున్నాడు. నీ చెయ్యి నిన్ను సంరక్షించెనన్నమాట నిజమని యెహోవా జీవముతోడు నీ జీవముతోడు అని ప్రమాణము చేయుచున్నాను. - 1 సమూ 25:25**

నాబాలు భార్య అతనిని మోటువాడు, దుష్టుడు అని మాట్లాడడానికి కారణం అతని ఆతురపడి మాట్లాడే స్వభావం. ఏ సందర్భంగా ఎక్కడ ఏం మాట్లాడాలో అది మాట్లాడాలి. **నా ప్రియ సహోదరులారా, మీరీసంగతి ఎరుగుదురు గనుక ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడువాడును, మాటలాడుటకు నిదానించువాడును, కోపించుటకు నిదానించువాడునై యుండవలెను. - యాకోబు 1:19** వినుటకు వేగిరపడి, మాట్లాడడానికి నిదానించాలి. మాట్లాడడానికి నిదానించి, వినడానికి కూడా నిదానించేవారిగా ఉండకూడదు. ఎంత చిన్నవారు చెప్పిననూ వినడానికి వేగిరపడాలి. వినడం అనేది సరిగా లేకపోతే మాట్లాడడం అనేది సరిగా ఉండదు, వెర్రిగా ఉంటుంది. ఎదుటివారు చెప్పేది మనసు పెట్టి వినాలి.

మాటలను సరిగా క్రమబద్ధం చేసుకుంటే శ్రేష్ఠమైన జీవితమును జీవించగలము. కొందరు అడిగిన దానికి కూడా మాట్లాడక మౌనంగా ఉంటారు. మరికొందరు మాట్లాడడం మొదలుపెడితే ఆపరు, అందువలన వారి విస్తారమైన మాటల వలన ఎన్నో సమస్యలను తెచ్చి పెడతారు. మాట్లాడుటకు సమయం కలదు, మాట్లాడకుండడానికి కూడా సమయం కలదు అని గ్రహించాలి. నాలుకను అదుపులో ఉంచుకునే వారు మూఢులైనప్పటికీ అనేక సమస్యల నుండి కాపాడబడతారు. కానీ ఎప్పుడూ మాట్లాడుతూనే ఉండేవారు ఎంత బుద్ధిమంతులైననూ వారి గౌరవం తగ్గిపోతుంది. **విస్తారమైన మాటలలో దోషముండక మానదు తన పెదవులను మూసికొనువాడు బుద్ధిమంతుడు. - సామె 10:19** ఇతరుల గురించి ఆలోచించడం కానీ, ఇతరులు చెప్పేది వినడం కానీ ఏమీ ఉండదు. మాకే అన్నీ తెలుసు అనే భావముతో వారికి తోచినట్లు మాట్లాడుతూనే ఉంటారు. కనుక విస్తారమైన మాటలు మాట్లాడకూడదు, ఇతరులు చెప్పేది శ్రద్ధగా వినాలి.

**ఒకడు కత్తికి పదును పెట్టునట్లు వారు తమ నాలుకలకు పదును పెట్టుదురు. - కీర్తన 64:3** కత్తికి పదును పెట్టినట్లుగా నాలుకకు పదును పెట్టే మాటలు మాట్లాడకూడదు. నాలుకకు పదును ఎక్కువైతే పొగరు పట్టిన మాటలు వస్తూ ఉంటాయి. కత్తికి కనికరం ఉండదు అలాగే కనికరం లేని మాటలు ఎదుటివారి హృదయములను కోస్తూ ఉంటాయి. పొగరు మాటలు మాట్లాడకూడదు. **అపవిత్రమైన వట్టి మాటలకు విముఖుడవై యుండుము. అట్టి మాటలాడువారు మరి యెక్కువగా భక్తిహీనులగుదురు. - 2 తిమోతి 2:16** అపవిత్రమైన వట్టి మాటల వలన భక్తిహీనతలోనికి వెళ్తాము. మన మాటలే మనలను కాపాడతాయి. అవే నాశనమునకు కూడా తీసుకువెళ్తాయి కనుక మన మాటలను కాపాడుకోవాలి. **అపవిత్రమైన ముసలమ్మ ముచ్చటలను విసర్జించి, దేవభక్తి విషయములో నీకు నీవే సాధకము చేసికొనుము. 1 తిమోతి 4:7** ముసలమ్మ ముచ్చట్లు అనగా అవసరం లేని విషయములు. ఇవి మాట్లాడి మన ఆత్మీయ జీవితమును నష్టపరచుకొని, సమయమును వ్యర్థం చేస్తున్నాము. ఎంతో నష్టమును తెచ్చుకుంటున్నాము కనుక వీటిని విసర్జించి, దేవభక్తి విషయములో సాధకం చేసుకునే వారిగా ఉండాలి. తన **నోరు కాచుకొనువాడు తన్ను కాపాడుకొనును ఊరకొనక మాటలాడువాడు తనకు నాశనము తెచ్చుకొనును. - సామె 13:3** మనము మన పరిస్థితిని చూచుకొని మాట్లాడడం మంచిది. మనలో బలహీనతలు, తప్పులు ఉంచుకొని, ఎదుటివారిని తప్పు పట్టడం, వారిని కరెక్ట్ చేయాలని చూడడం మన నాశనం మనం తెచ్చుకోవడమే. మన మాటలను ఎదుటి వారు సహించుకున్ననూ, దేవునికి మనము లెక్క అప్పచెప్పవలసి ఉన్నది.

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర



**– సీరియల్ 43వ భాగము**

ఆయన వస్త్రధారణను గూర్చి ఎన్నో ఊహాగానాలు వినబడినాయి. కచ్చితమైన నియమములు పాటిస్తూ, శరీర మును మనస్సును అదుపులో ఉంచుకున్న సన్నటి హిందూ సన్యాసిలా ఉంటాడేమోనని కొందరు, ఎంతో కాలం ధ్యానంలో గడిపిన బౌద్ధ భిక్షువు వలె ప్రశాంతతో ఉంటాడేమోనని మరికొందరు, అధికారమును హస్తగతం చేసికొన్న రోమన్ కథోలిక్ బిషప్ లాగనో, ఆంగ్లికన్ బిషప్ లాగానో ఉంటాడని ఇంకొందరు అనుకొంటుండినారు. అయితే తమ సంఘములపై పాశ్చాత్య దేశాల్లోని క్రైస్తవ సంఘముల విధానములను రుద్దుతూ అణుమాత్రమైనా భారతీయత కనిపించని క్రైస్తవ సంఘములను తయారుచేసే పాశ్చాత్య మిషనెరీగా అతడు ఉండడని మాత్రం అందరికి తెలిసిపోయింది. యేసుక్రీస్తు సువార్తను భారతీయ భాషలోనికి అనువదించడమే గాక భారతీయ సంస్కృతికి, దాని ఆధ్యాత్మిక స్వాస్థ్యమునకు అనుగుణంగా కూడా అందించాలనేదే వారి భావం. ఇలాంటి వారందరూ క్రిష్టో సమాజ్ అనే పేరు గల గుంపుగా సమకూడారు. ప్రజలతో వ్యక్తిగతంగాను గుంపుతోను ఆయన మాట్లాడతారో లేదోనని వారు అనుకొనుచుండినారు. ఉత్తర భారతదేశ క్రైస్తవ సేవా సమాజమును, టిబెట్ యాత్రలో సుందర్ అనుభవములను వారు తెలిసికొనగోరినందున ఆయన తమతో మాట్లాడాలని వారాశించారు. పి.చెంచయ్య అనే యౌవన లాయరు ఎన్నో సంవత్సరముల తరువాత పుదుకట్ట రాష్ట్రానికి ప్రధాన న్యాయమూర్తియైనప్పుడు "నేనూహించిన దానికి పూర్తిగా భిన్నంగాను, ఎంతో శ్రేష్ఠమైన వానిగాను ఉండినాడు, ఈ పొడవాటి యౌవనుడు ప్రవక్త యొక్క అగ్ని గలవాడై అపోస్తలుల శక్తితో వర్తమానములందించాడు. ప్రజలు ఏకాగ్రతతో ఆయన పెదవులనే చూస్తుండినారు" అని సుందర్‌ని చెప్పాడు. సాధువు తన వర్తమానములలో తన అనుభవములు, తాను గమనించిన విషయములనే ఎక్కువగా చెప్తూ ఉపమానరూపంలో వారికందిస్తూ ఉండేవాడు.

మద్రాసులో 15 రోజులుండి ప్రతిరోజు ఎన్నో గుడులలోను, హాల్లోనూ వాక్యమును ప్రకటించాడు. పెద్ద సంఖ్యలో ప్రజలు రావడం వలన కొందరిని వెనక్కు పంపించాల్సి వచ్చేది. ఇలాంటి కూటములలో వాక్యమందించడంతో బాటు వ్యక్తిగతంగా మనుష్యులతో మాట్లాడడం, గుంపులతో చర్చించడం కూడా చేస్తుండేవాడు. ఒక సన్నివేశాన్ని 'ది క్రిష్టియన్

పేట్రియాట్' అనే పత్రికలో చెంచయ్యగారు చాల విపులంగా వ్రాశారు.

ఇచ్చుట భారతీయత కొట్టినట్లుగా కనబడింది. కొందరు కుర్చీలలోను, కొందరు నేల మీదను కూర్చున్నారు. వారి మధ్య సుందర్ కూర్చున్నాడు. వారాయనతో ఎంతో స్వేచ్ఛగా మాట్లాడుతూ ఎన్నో ప్రశ్నలడుగుచుండినారు. మరి ముఖ్యముగా రహస్య క్రైస్తవ సన్యాసుల మిషన్‌ను గూర్చి ఎక్కువగా తెలుసుకోవాలని వారు ఎంతో కుతూహలం చూపారు. అందుకాయన మొట్టమొదట కైలాస మహర్షి ద్వారా ఈ మిషన్ గూర్చి నాకు తెలిసింది. నేను వారి కోవకు చెందిన వాడిని కాకపోయినను వారెంతో గొప్ప క్రైస్తవ సేవ చేయుచున్నారని మాత్రం చెప్పగలను. ఉత్తర భారతదేశములో సంచరించుచు ఎంత ప్రేమ, త్యాగములతో ప్రభువు సువార్త వ్యాపించుచున్నదో చూచినప్పుడు నేనెంతో అదిరిపోయాను. పూర్తిగా భారతీయ పద్ధతిలోనే వారు సేవ చేస్తూ ఒక్కొక్క వ్యక్తికి మాత్రమే సువార్తని అందిస్తున్నారు. అందుచేత వీరి నడవడి గుణశీలములలోని మార్పు వలన తప్ప వారు క్రైస్తవులయ్యారని ఆ ఇంటి వారికి కూడా తెలియదు. ఇలా రహస్య క్రైస్తవులుగా ఉండడం వలన వారి క్రైస్తవ విశ్వాసానికి ఎలాంటి భంగము కలుగదు. తమ క్రైస్తవ జీవితము, ఆసక్తిని బట్టి క్రైస్తవులకు అవమానం తెచ్చిన ఎన్నో కుటుంబములను నేనెరుగుదును. గంగానదీ తీరములో సువార్త ప్రకటించుచున్న దినములలో గొప్ప సమూహములను ఆకర్షిస్తుండిన ఒక హైందవ బోధకుని(సన్యాసిని) గూర్చి విన్నాను. మీరు తప్పకుండా ఆయనను చూడాలని ప్రజలు నాతో చెప్పినప్పుడు ఒకరోజు ఆయనను ఏకాంతముగా కలుసుకోగలిగాను. నేను క్రీస్తు శిష్యుడను, క్రైస్తవుడను అని చెప్పినప్పుడు అతడు వెంటనే నన్ను కౌగలించుకొని సహోదరుడా మనమిద్దరం చేస్తున్నది ఒకే సేవ అన్నప్పుడు నాకాశ్చర్యం అయిపోయింది. అయితే మీరు క్రీస్తును ప్రకటించడం నేనెన్నడు వినలేదే అన్నప్పుడు ఆయన ఇచ్చిన జవాబు మంచి వ్యాఖ్యానం లాగుండినది. ముందు నేలను సాగు చేయకుండ ఏ వ్యవసాయదారుడైనా విత్తనములు విత్తుతాడా? నా ఉపన్యాసములు వినడానికై వచ్చేవారికి మొదట ఆధ్యాత్మిక విలువలను బోధిస్తాను. అలా వినగా వారిలో నీతి కొరకు ఆకలిదప్పులు కలిగినప్పుడు క్రీస్తును వారికందిస్తాను. గత సంవత్సరం విద్యావంతులైన 12 మంది హిందువులకు బాప్తిస్మమిచ్చానని చెప్పి దీనిని నాతో ఎల్లప్పుడూ తీసికొని పోవుచుంటానంటూ సంచిలో నుండి బైబిలు తీసి చూపించాడు.

(ఇంకా ఉంది)

– సేకరించబడింది

# నిజ స్నేహితుడు (True Friend)



Hai Children! ఈ పత్రిక ద్వారా మీతో మాట్లాడటానికి అవకాశం వచ్చినందుకు నేను చాలా సంతోషించుచున్నాను. మీరు ఎలా ఉన్నారు? సంతోషంగా ఉన్నారా? ఎలా చదువుతున్నారు? క్వార్టర్లీలో మార్క్స్ ఎలా వచ్చాయి? దసరా హాలిడేస్ ఎలా గడిచాయి? "చదువు, చదువు" అని పేరెంట్స్, టీచర్స్ చెబుతుంటే మీకు బాధ కలుగుతుందేమో కదా! మీరు బాగా చదువుకొని ప్రయోజకులుగా మారాలని మా అందరి తపన.....

ఒక గ్రామంలో కిషోర్ అనే అబ్బాయి ఉండేవాడు. కిషోర్ ఎప్పుడూ హుషారుగా ఆడుతూ పాడుతూ గెంతుతూ ఉండేవాడు. ఎక్కడకు వెళ్ళాలన్నా వెనకా ముందు చూసుకోకుండా పరిగెత్తటం వలన చాలాసార్లు కిందపడి కాళ్ళకు చేతులకు దెబ్బలు తగిలించుకునే వాడు. కిషోర్‌కి ప్రసాద్ అనే స్నేహితుడు ఉండేవాడు. ప్రసాద్ బాగా చదువుతాడని కిషోర్ వాళ్ళ అమ్మ కిషోర్‌ని ప్రతిరోజు ప్రసాద్ వాళ్ళ ఇంటికి పంపేది. ఎప్పటిలాగానే ఒకరోజు కిషోర్, ప్రసాద్ వాళ్ళ ఇంటికి బయలుదేరాడు. వర్షాకాలం కావటంతో దారంతా బురద బురదగా ఉంది. గబగబా వెళ్లేవాడల్లా నెమ్మదిగా నడవసాగాడు. ఎంత జాగ్రత్తగా నడిచినప్పటికీ బురదలో కాలు జారి పక్కనే ఉన్న పెద్ద గోతిలో పడిపోయాడు.

గోతి లోపల కూడా బురద ఉండటంతో కిషోర్‌కి పెద్దగా దెబ్బలు తగలలేదు. కాని గోతిలో నుంచి ఎలా బయటకు రావాలో తెలియక చాలా భయపడ్డాడు. కాసేపటికి తేరుకొని సహాయం కోసం కేకలు పెట్టాడు. కానీ ఆ దారిలో జనసంచారం ఎక్కువగా లేకపోవటంతో ఎవరూ రాలేదు. కాసేపటికి అటుగా వెళ్తున్న ఒక వ్యక్తి కిషోర్ అరుపులు విని గొయ్యి దగ్గరకు వెళ్లాడు. అతను కిషోర్ వాళ్ల వీధిలో ఉండే వ్యక్తే. గోతిలో ఉన్న కిషోర్‌ని గుర్తు పట్టాడు. "నువ్వా కిషోర్! ఎలా పడిపోయావు. అయినా నువ్వు ఎప్పుడూ మామూలుగా నడవవు కదా! ఎగురుకుంటూ వచ్చి దీంట్లో దూకుంటావు. చూసావా నీ అల్లరి పనులు నిన్ను ఏ స్థితికి తెచ్చాయో" అని తిట్టాడు.

"నేను జాగ్రత్తగానే నడుస్తున్నాను, అయినా పడిపోయాను" అని కిషోర్ చెపుతుంటే కూడా విన్పించుకోలేదు. "ముందు మీ అమ్మానాన్నలకు ఈ సంగతి చెప్పాలి" అంటూ ఆ

వ్యక్తి వెళ్లిపోయాడు.

కాసేపటికి మరో వ్యక్తి అక్కడకు వచ్చాడు. "అయ్యో బాబూ! పడిపోయావా పాపం! దెబ్బలు బాగా తగిలాయా? ఆ దేవుడే నిన్ను ఏదోరకంగా కాపాడతాడు" అని ఆ వ్యక్తి వెళ్లిపోయాడు.

మరికాసేపటికి ఇంకో వ్యక్తి అక్కడకు వచ్చి "అసలు దారి పక్కనే ఇంత గొయ్యి ఎవరు తవ్వారు, ఎందుకు తవ్వారో ముందు తెలుసుకోవాలి" అనుకుంటూ వెళ్లిపోయాడు. వచ్చిన వాళ్లు ఎవరూ తనను రక్షించకుండా వెళ్లిపోవడంతో కిషోర్ ఆ గోతిలో కూర్చుని గట్టిగా ఏడవసాగాడు.

ప్రతిరోజు చదువుకోవటానికి వచ్చే కిషోర్ ఆరోజు ఎంతకీ రాకపోవటంతో ప్రసాద్ కిషోర్ వాళ్ల ఇంటికి బయలుదేరాడు. దారిలో కిషోర్ ఏడుపు విన్పించి గోతి దగ్గరకు వెళ్లాడు. కిషోర్‌ని ఆ స్థితిలో చూసి చాలా బాధపడ్డాడు. వెంటనే తేరుకొని కిషోర్‌ని రక్షించేందుకు ఉపక్రమించాడు. గోతి దగ్గర బోర్లా పడుకుని తన చేతితో గోతిలోని కిషోర్ చేతిని అందుకోవటానికి ప్రయత్నం చేశాడు, కానీ చేతులు అందలేదు. వారి చేతుల మధ్య దూరం చాలా ఉంది. అప్పుడు ప్రసాద్ లేచి ఆ చుట్టుపక్కల వెతికి ఒక త్రాడు సంపాదించాడు. ఆ త్రాడు ఒక చివరని దగ్గరలో ఉన్న చెట్టుకి కట్టి మరో చివరని గోతిలోకి వదిలాడు. కిషోర్ త్రాడుని పట్టుకున్నాక ప్రసాద్ తన బలాన్ని అంతా ఉపయోగించి త్రాడును నెమ్మదిగా బయటకు లాగటం మొదలు పెట్టాడు. అలా చాలాసేపు కష్టపడి లాగిన తర్వాత కిషోర్ గోతిలో నించి బయట పడ్డాడు. అంతలో అక్కడకు కిషోర్ తల్లితండ్రులు వచ్చారు. తమ కుమారుడిని రక్షించిన ప్రసాద్‌ను వారు మెచ్చుకున్నారు. కిషోర్‌ని రక్షించిన సంగతి తెలుసుకున్న ఊరి వారంతా ప్రసాద్‌ని అభినందించారు. కష్టాల్లో ఉన్నప్పుడు కాపాడే మంచి స్నేహితుడ్ని పొందినందుకు కిషోర్ చాలా ఆనందించాడు.

మన ప్రభువైన యేసు క్రీసు మంచి స్నేహితుడు. మన కొరకు ప్రాణము పెట్టి, మన పాపములను క్షమించి, రక్షించిన నిజ స్నేహితుడు. ఆయనను మంచి స్నేహితునిగా మన జీవితములోనికి ఆహ్వానిద్దాము. ఆయన చూపిన ప్రేమ, సహాయం చేసే మనసు మనం కూడా కలిగి ఉండి ఇతరులకు చూపిద్దాము. Next Month December "Special Christmas" గా సెలబ్రేట్ చేసుకోండి. పండుగ హడావిడిలో ఏది ప్రాముఖ్యమైనదో మరచిపోక, దేవునికి హృదయములను సమర్పించుకొనుడి. మంచి స్నేహితుని గుణలక్షణాలను కలిగి ఉండండి. యేసు మన ప్రాణ స్నేహితుడు కదా! మనం కూడా అట్టి త్యాగమును కలిగి ఉండాలని కోరుకుంటూ....

**– మీ అక్కయ్య**

# "నా జీవితములో దేవుని మేలులు"

**దేవిద్, అనాజ్‌పూర్**

నేను పశ్చిమ గోదావరి జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామమునకు చెందిన వాడిని. సాధారణ మధ్యతరగతి, హిందూ కుటుంబములో విగ్రహ సంబంధమైన పూజలతో నా చిన్నతనం కొనసాగింది. మేము ఐదుగురు అన్నదమ్ములం, ఒక చెల్లి. రెండవ సంతానమైన నేను చిన్నతనంలోనే మా పెద్దమ్మగారికి పెంపుడు కొడుకుగా వెళ్ళటం జరిగింది. నా చిన్నతనం నుండి 10వ తరగతి వరకు విగ్రహారాధనతో గడిచింది. తరువాత కాలేజ్ చదువు నిమిత్తం ఏలూరులో రూమ్ తీసుకొని ఉంటున్న సమయంలో నా స్నేహితులు కొందరు దగ్గరలోని చర్చ్‌కి వెళ్తూ ఉండేవారు. నేను కూడా అప్పుడప్పుడు వారితో వెళ్ళేవాడిని. దగ్గరలోని ఆర్.సి.ఎమ్,  బాప్టిస్ట్, ఇంకా చాలా చర్చిలకు వెళ్ళేవాడిని కాని నాలో ఎలాంటి మార్పు లేదు, హృదయ ఆలోచనలు చాలా భయంకరమైనవిగా ఉండేవి. మా ఊరిలో  బంధువులలో, స్నేహితులలో కూడా నేను చాలా మంచివాడినే కానీ అన్నీ చెడు అలవాట్లు, చెడు ఆలోచనలు ఉండేవి. గోవర్ధన్ అనే నేను ప్రజల దృష్టిలో మంచివానిగాను, దేవుని దృష్టిలో అనగా నా హృదయం ఆయనకు దూరంగాను ఉండేది. అలా ఉంటుండగా మా తల్లి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్ళి వచ్చే మార్గంలో పడిపోవడం వలన కాలికి దెబ్బ తగిలింది. ఆ దెబ్బ ఎంతకీ నయం కాకపోవడంతో మా ఊరిలో కొందరు  క్రైస్తవులు చర్చికి వెళ్తే స్వస్థత కలుగుతుంది, మనం అనుకున్నవన్నీ జరుగుతాయి అని చెప్పటం వలన ఆమెకున్న అనారోగ్య పరిస్థితిని బట్టి ఒక సహోదరితో కలిసి అక్కడకు వెళ్ళింది. తరువాత ఆమె మారుమనస్సు పొంది, మాకు దగ్గరలోని చర్చికి వెళ్ళుచూ రక్షించబడింది.

అప్పటి నుండి నేను కూడా పండుగలకు ఏవైనా చర్చిపనుల నిమిత్తం ప్రార్థనకు వెళుతుండే వాడిని, కాని నా హృదయంలో అయితే మార్పు లేదు. ఆ పరిస్థితులలో నాకు వివాహం చేయాలని అనుకుంటుండగా, క్రైస్తవ కుటుంబంలో ప్రార్థనాపరుల కుటుంబం నుండి వచ్చే అమ్మాయి కావాలని ఆశించేవాడిని. విగ్రహారాధన కుటుంబాల నుండి వచ్చిన సంబంధములను అంగీకరించలేదు. నేను ఆశించిన విధంగా దేవుడు ఆత్మీయంగాను, ఆర్థికంగాను మా కుటుంబం కంటే చాలా మెరుగైన కుటుంబం నుండి వచ్చిన అమ్మాయితో నా వివాహాన్ని సిద్ధపరచినాడు. వివాహమైన తరువాత ఆర్థిక సంబంధమైన  ఇబ్బందులతో, కుటుంబంలో సమాధానం లేక ఎంతో వేదన చెందేవాడిని. ఆ సమయంలో రామోజీ ఫిల్మ్‌సిటీలో మా బావ పని చేస్తుండేవాడు, అక్కడకు వెళ్ళాలనే ఆలోచన కలిగింది. ఆయన కూడా రమ్మని చెప్పటం వలన నేను ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చాను. నేను పనికి వెళ్ళే మార్గంలో తడికెలతో వేయబడిన చిన్నపాకలో ప్రార్థన జరుగుతుండటం చూసాను. ఇక్కడ

ఒక చర్చి ఉన్నదని భార్యాపిల్లలతో కలసి వెళ్ళవచ్చని మనసులో అనుకున్నాను. ఒక నెల తరువాత కుటుంబమంతా అనాజ్‌పూర్ రావటం జరిగింది. మేము ఉన్న రూమ్ ప్రక్కన ఒక సహోదరి ఆరాధనకు వెళుతుందని తెలిసి నా భార్య ఆమెతో కలసి ఆ చిన్న పాకలో జరిగే ఆరాధనకు వెళ్ళింది. తరువాత వారంలోనే ఆ తడికెలతో వేయబడిన పాక తీసివేసి రోడ్డు ప్రక్కన తాటాకులతో ఒక మందిరం నిర్మించటం జరిగింది. దాని ప్రారంభం రోజున నేను మొదటిగా ఎపఫ్రా మినిస్ట్రీస్ కి వెళ్లటం జరిగింది. అక్కడ వాక్య పరిచర్య, సహోదరుల ప్రేమ, వారి యొక్క ఆత్మీయత మమ్ములను ఆ మందిరానికి, ఆ పరిచర్యకు దగ్గర చేసింది. ఒకసారి అక్కడ 3 రోజులు జరిగిన బహిరంగ సభలలో, ఈ రాత్రే దేవుడు నీ ప్రాణమడిగితే నీవు ఎక్కడికి వెళతావు ? అనే వాక్యం ద్వారా నాతో మాట్లాడి, నేను ఆయనకు నా హృదయమును ఇచ్చే విధంగా దేవుడు సహాయం చేసారు. తరువాత నేను బాప్తిస్మం తీసుకొని ఈ పరిచర్యలో కొనసాగుతుండగా నాకు రెండవ సంతానంగా పుట్టిన కుమార్తె 3 నెలలకు అనారోగ్యంతో చనిపోయింది. మాకు ఏమి చేయాలో తోచని ఆ పరిస్థితిలో  పరిచర్యలో ఉన్న సహోదరులు మమ్ములను ఆదరించి, బాధ్యత తీసికొని ఆ కార్యక్రమం విషయంలో ఎంతో సహాయం చేసారు. పరిచర్యలో చెప్పబడిన వాక్యం ద్వారా మేము చాలా విషయాల్లో మార్చుకోవటం జరిగింది. సహోదరుల ప్రేమ యందు, క్షమించుట యందు సంతృప్తి కలిగి జీవించుటయందు వాక్యానుసారముగా జీవించాలనే వాంఛ మాకు కలిగింది. దైవసేవకులు వాక్యం బోధించుట మాత్రమే కాక వాక్యానుసారంగా జీవిస్తూ చూపించే మాదిరి మమ్ములను ఎంతగానో ఆకర్షించింది.

అంతేకాక పరిచర్యలో ఉన్న సహోదరులు చూపించే ప్రేమ, వినే వాక్యమును అనుసరించాలనే తపనే మేము ఈ పరిచర్యలో నిలిచి యుండటానికి కారణం. ఇంకా పరిచర్యలో జరిగే ఉపవాస ప్రార్థనల ద్వారా మేము ఎంతో బలపరచబడుచున్నాము. ఉపవాస ప్రార్థన లోని శక్తిని దేవుడు చేసే అనేక కార్యాల ద్వారా మేము తెలుసుకున్నాము. ఆయన మాకు కలిగిన ఆర్థిక ఇబ్బందులన్నీ తీసివేసి,  కాపరిగా ఉండి లేమి అనేది లేకుండా చేసారు.  కుటుంబములో సమాధానమును, మా హృదయములో ఆనందమును దయచేసారు. ఒకవేళ నేను ఈ పరిచర్యకు వచ్చియుండకపోతే ఊరిలోనే ఉంటూ ఒక నామకార్థ క్రైస్తవుడుగా మిగిలి యుండేవాడిని. నేను, నా కుటుంబము ఆయన నిత్య రాజ్యము కొరకు సిద్ధపడుచూ, ఈ లోకములో దేవునికి మహిమ కలిగే విధంగా జీవించుటకు అన్ని విషయములలో దేవుడు బలపరచునట్లు మా కొరకు ప్రార్థించండి.

# సత్యము

సాధారణముగా చెప్పుకోవాలంటే క్రైస్తవులు రెండు రకాలుగా విభజింపబడుదురు.

1. వారి పుట్టుకను బట్టి "రోమన్ కథోలిక్కులు" లేక "ప్రొటెస్టెంట్లు"

2. సంఘ ఆరాధన క్రమమును బట్టి "ఎపిస్కోపల్" మరియు "ప్రీచర్స్"

3. అనుభవాన్ని బట్టి "తిరిగి జన్మించిన క్రైస్తవులు" మరియు "నామకార్థ క్రైస్తవులు"

4. సిద్ధాంతాన్ని బట్టి "ఇవాంజలికల్స్" మరియు "లిబరల్స్"

5. భాషలలో మాట్లాడు అనుభవాన్ని బట్టి "కరిస్మాటిక్" మరియు "నాన్ కారిస్మాటిక్"

6. వృత్తిని బట్టి "ఫుల్ టైం క్రైస్తవ పనివారు" మరియు "సెక్యులర్ పనివారు"

ఇంకా ఇవికాక వేరే విధాలుగా కూడా విభజనలున్నవి. అయితే వీటిలో ఏ విభజన కూడా యేసు ప్రభువు పరిష్కరించుటకు వచ్చిన మూల సమస్య గూర్చి చెప్పుట లేదు. చాలా మందికి "క్రీస్తు మన పాపముల కొరకు చనిపోయెనని" (1 కొరింథీ 15:3) తెలియును. కాని అనేకులకు క్రీస్తు మన కొరకు చనిపోయినది మనమిక మీదట మన కొరకు జీవించక ఆయన కొరకు జీవించవలెను" (2 కొరింథఈ 5:15) అని బైబిలు చెప్పుచున్నదని తెలియదు.

అందువలన క్రైస్తవులను వాక్యానుసారంగా ఈ క్రింది విధంగా విభజించవచ్చును. "వారి కొరకు వారు జీవించువారు" మరియు క్రీస్తు కొరకు జీవించువారు" లేక "వారి స్వంతము కొరకు వెదకుకొనువారు" మరియు "క్రీస్తును గూర్చిన విషయాలను వెదకువారు" లేక "మొదట ఈ లోక సంబంధమైన విషయాలను వెదకువారు" మరియు "దేవుని రాజ్యమును మొదట వెదకువారు" లేక "ధనాన్ని ప్రేమించువారు" మరియు "దేవునిని ప్రేమించువారు" (రెండిటిని ప్రేమించడం అసాధ్యమని యేసు ప్రభువు చెప్పారు, లూకా 16:13) ఈ విధమైన విభజన మాత్రమే అవసరమైనది. ఇంతకు ముందు చెప్పుకున్న పద్ధతులన్నీ బాహ్య జీవితానికి సంబంధించినవి మాత్రమే. అయితే ఈ రెండవ పద్ధతిలోనే పరలోకము క్రైస్తవులను విభజిస్తుంది. ఎందుకంటె మన అంతరంగిక అభిప్రాయాలు ఆశలు ఎవరికీ తెలియవు కాని మనకే బాగుగా తెలియును. చివరకు మన భార్యలకు లేక భర్తలకు కూడా మనము దేని కోసం జీవిస్తున్నామో తెలియదు.

మన ప్రభువు ముఖ్యంగా వచ్చినది ప్రజలకు ఒక సిద్ధాంతాన్ని ఇచ్చుటకు కాని, లేక ఒక సంఘ ఆరాధనా పద్ధతినిచ్చుటకు లేక భాషలలో మాట్లాడుటకు లేక చివరకు ఒక అనుభవాన్నిచ్చుటకు కాని కాదు.

ఆయన మనలను "మన పాపముల నుండి క్షమించుటకు" వచ్చెను. ఆయన గొడ్డలిని చెట్టువేరుపై వేయుటకు వచ్చెను. పాపము యొక్క మూలము, మనకు మనమే కేంద్రముగా ఉంటూ, మన స్వంత ఇష్టాన్ని నెరవేర్చుకొనుటయైయున్నది. మన జీవితాల్లో ఉండిన ఈ "వేరు"ను మన ప్రభువు గొడ్డలితో నరుకునట్లు ఒప్పుకొనకపోతే మనము బాహ్యముగా క్రైస్తవులుగా మాత్రమే యుందము. మన సిద్ధాంతాలను బట్టి లేక మన అనుభవాలను బట్టి లేక మన సంఘ ఆరాధనా కార్యక్రమమును బట్టి మనము ఇతర క్రైస్తవుల కంటె పై తరగతి వారమను కొనునట్లు సైతాను మనలను మోసపుచ్చును!

మన కొరకు మనము జీవించునంత కాలము మనము సరియైన సిద్ధాంతములో ఉండినా, అనుభవములో ఉండినా మరియు సంఘ కార్యక్రమము సరిగా ఉండినా సైతాను పట్టించుకొనడు. ఈనాడు క్రైస్తవలోకము ఎవరి స్వార్థము వారు చూచుకొంటూ, వారికొరకే వారు జీవిస్తూ, కేవలము వారి కుండిన సిద్ధాంత భేధము వలన లేక సంఘ ఆరాధనా క్రమము లేక "అనుభవాలను" బట్టి దేవుడు వారిని ప్రత్యేకముగా దృష్టిస్తున్నాడనుకొనే క్రైస్తవులతో నిండిపోయి ఉన్నది.

యేసు ప్రభువు యొక్క 33 1/2 సంవత్సరాల ఈలోక జీవితములో ఆయన తన చిత్తాన్ని ఉపేక్షించుకొని తన తండ్రి ఇష్టాన్ని నెరవేర్చెను. మరియు ఆయన తనకు శిష్యులుగా ఉండగోరువారు అదే మార్గములో వెళ్ళవలెనని తేటగా చెప్పెను. ఆయన మన జీవితాల్లో ఉన్న పాపము యొక్క వేరును నరుకుటకు వచ్చెను. "మన స్వంత ఇష్టమును చేయుట" నుండి మనలను విడుపించుటకు వచ్చెను. కొన్నివేల సంవత్సరములు మానవుడు భూమి విశ్వానికి మధ్యలో ఉన్నదని ఊహించుకుంటూ పొరపాటు పడ్డాడు. సూర్యుడు, చంద్రుడు మరియు నక్షత్రాలు 24 గంటలకొకసారి భూమి చుట్టూ తిరుగుతున్నట్లు గానే మానవ దృష్టికి కనబడేది. కాని కేవలం 450 సంవత్సరాల క్రితం కొపెర్నికస్ అనే ఒక వ్యక్తి భూమి విశ్వానికి మధ్య ఉండడం కాదు కాని చివరకు సూర్య కుటుంబానికి కూడా మధ్యలో లేదని చూపించాడు. సూర్యునికి మధ్యలో ఉండునట్లుగా భూమి సృష్టింపబడిందని అతడు చూపించాడు. మానవుని యొక్క కేంద్ర స్థానము తప్పుగా ఉన్నంతవరకు, అతడి శాస్త్రీయమైన లెక్కలు, అంచనాలు తప్పుగా ఉంటాయి. అయితే ఒకసారి మానవుడు సరియైన కేంద్ర స్థానాన్ని కనుగొనిన తరువాత ఆ లెక్కలు అంచనాలన్నీ సరిగా మారతాయి.

మనము దేవునిని కేంద్ర స్థానముగా ఉంచుకోవడానికి బదులు మన స్వంతాన్ని కేంద్రముగా ఉంచుకొన్నంత కాలము మన విషయంలోనూ అంతే. అప్పుడు బైబిలు గూర్చి , దేవుని గూర్చి మన గ్రహింపు (మన లెక్కలు మరియు అంచనాలు) తప్పుగా ఉండును. కాని మానవుడు 5000 సంవత్సరాలు అతడు సరియైన విధముగానే ఆలోచిస్తున్నానని, ఎలా

అనుకున్నాడో (మనము పైన చూచినట్లు) మనము కూడా అలానే సరిగానే ఆలోచిస్తున్నామని అనుకోవచ్చు. కాని మనము నిజానికి 100% తప్పుగా ఉండవచ్చును.

ఇదే విషయాన్ని మనము అనేక “మంచి క్రైస్తవులలో” కూడా చూస్తూ ఉంటాము. వారికి ఒకే బైబిలు నుండి వేరు వేరు వివరణలుంటాయి, వాటిని ప్రతివారు తమదే సరియైనదని ఇతరులది తప్పని అనుకొందురు. ఇతరులు మోసపోతున్నారని కూడా వారంటారు. ఇలా ఎందుకు? దానికి కారణం వారి కేంద్రస్థానము తప్పుగా ఉన్నది.

దేవునిలో మధ్య స్థానంగా ఉండాలని మానవుడు సృష్టింపబడ్డాడు కాని తనకు తాను మధ్యస్థానంగా ఉండుటకు కాదు. ఎప్పుడైతే క్రైస్తవుల యొక్క కేంద్రస్థానము తప్పుగా ఉంటుందో అప్పుడు వారి సువార్త కూడా తప్పుగా ఉంటుంది. ప్రాధమికంగా రెండు సువార్తలే ఈనాడు ప్రకటింపబడ్తున్నాయి. అవి ఒకటి మానవుడు కేంద్రస్థానముగా ఉన్నది రెండవది దేవుడు కేంద్రస్థానముగా ఉన్నది. మానవుడు కేంద్రస్థానముగా ఉండిన సువార్త మానవునికి ఈ లోకంలో అతడి జీవితము సౌఖ్యముగా సాగిపోవుటకు కావలసినవి అన్నీ ఇస్తూ, అతడి జీవితము ముగించబడిన తరువాత పరలోకములో కూడా స్థానము దేవుడు ఇచ్చునని వాగ్దానము చేస్తుంది. యేసుప్రభువు ఒకని పాపాలన్నింటిని క్షమించి, రోగములన్నిటి నుండి స్వస్థపరచి, అతడిని అన్ని విధాల వృద్ధి పొందునట్లు దీవించి, తన ఇహలోక సమస్యలన్నింటిని పరిష్కరించుట, మొదలైనవి కలిగించునని మానవునికి బోధింపబడ్తుంది. అటువంటి జీవితంలో స్వంతానికి సంబంధించినది కేంద్రంగా నిలబడ్తుంది, మరియు దేవుడు అతడి చుట్టూ తిరుగుతూ, అతడికి ఒక సేవకునిగా అతడి ప్రతి ప్రార్థనకు జవాబిస్తూ అతడు అడిగినది ప్రతీది ఇస్తూ ఉంటాడు!! అతడు చెయ్యాల్సిందల్లా ‘నమ్మి’ యేసుక్రీస్తు నామములో ఈలోక సంబంధమైన ప్రతి ఆశీర్వాదాన్ని అడగాలి!! ఇది తప్పుడు సువార్త, ఎందుకంటే అందులో మారుమనస్సు గూర్చి లేదు. బాప్తిస్మమిచ్చు యోహాను, యేసుప్రభువు, పౌలు, పేతురు, అపోస్తలులందరు మొట్ట మొదట ప్రకటించినది మారుమనస్సు గూర్చియే, అయితే ఇప్పుడు అన్నిటికంటె చివరన కూడా మారుమనస్సు గూర్చి ప్రకటింప బడుటలేదు!!

దేవుడు కేంద్రముగా కలిగిన సువార్త మారుమనస్సు పొందమని పిలుస్తుంది, ఆయనను హృదయమంతటితో ప్రేమించమని చెప్తుంది. క్రీస్తు సిలువపై తన పాపములను గూర్చి చనిపోయాడు అను విషయమును విశ్వసించి మారుమనస్సు పొందినప్పుడు మాత్రమే ఒక మనుష్యుడు తన పాపములకు క్షమాపణ పొందుతాడు. అప్పుడు అతడు దేవుడు కేంద్రంగా కలిగిన జీవితం జీవించుటకు ప్రతి దినము తనను తాను ఉపేక్షించు కొనగలుగుటకు శక్తి పొందునట్లు పరిశుద్ధాత్మను పొందును. ఈ సువార్తను యేసుప్రభువు

అపోస్తలులు బోధించారు. తప్పుడు సువార్త ద్వారాన్ని వెడల్పుగాను, మార్గాన్ని విశాలముగాను చేయును. (అందులో ఒకడు తనను తాను ఉపేక్షించుకోనక్కర్లేదు, ఒకనికి ఆసక్తికరమైన విషయాల గూర్చి జీవించుట మాననక్కర్లేదు లేక ఒకనికి లాభము చేకూర్చే వాటిని వెదకుట మాననక్కర్లేదు. కాబట్టి ఆ మార్గములో నడుచుట సులువుగాను నుండును) అటువంటి అసత్యమైన సువార్త బోధింపబడు కూటములను వినుటకు లక్షల కొద్ది ప్రజలు వెళ్ళుదురు. అనేకులు ఆ మార్గము గుండా ప్రవేశించి దానిలో నడుస్తూ అదే నిత్య జీవానికి తీసుకు వెళ్తుందని ఊహించుకొందురు. కాని అది నిజానికి నాశనానికి నడిపిస్తుంది అయితే ఈ సువార్తను ప్రకటించు సువార్తికులు దీనియందే సంతోషిస్తూ, వారి కూటాలకు హాజరైన సమూహాలలో క్రీస్తుకొరకు నిర్ణయము తీసుకొని చేతులెత్తిన వారి గూర్చి నివేదికలలో చెప్తుంటారు. కాని అదంతా మోసమే. అటువంటి కూటాల్లో కొందరు వారిలో ఉన్న నిజమైన ఆశను బట్టి నిజంగా మార్పు చెందిన, అనేకులు రెండింతలు నరకానికి పాత్రులగుదురు" (మత్త23:15), ఆ విధంగా వారి నిజస్థితి గూర్చి వారు మోసపోదురు.

అయితే సత్యమైన సువార్త ద్వారాన్ని చిన్నదిగా చేసి మార్గాన్ని ఇరుకుగా చేస్తుంది. కాని కొందరు అతి భక్తులుగా నుండు మతమౌఢ్యులు ఆ మార్గాన్ని యేసుప్రభువు ఇరుకుగా చేసినదానికంటె ఇరుకుగా చేయుదురు. కాని ఆ మార్గమును యేసుప్రభువు ఎంత ఇరుకుగా ఉంచారో అంతే ఇరుకుగా సత్య సువార్త చేయును. అందువలన ఈ మార్గాన్ని కనుగొనువారు కొందరే. ఈ సువార్త గూర్చి నివేదికలు ప్రచురించుటకు ఎక్కువ ఏమీ ఉండదు మరియు వాటి లెక్కలు చూస్తే ఆకర్షణీయంగా ఉండవు. కాని ఈ సువార్త ప్రజలను ప్రభువైన యేసు నొద్దకును మరియు పరలోకానికిని తీసుకువెళ్ళును. "మీరేమి వింటున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి. తాను వినిన దానికి లోబడిన వానికి మరి ఎక్కువ వెలుగును, గ్రహింపును ఇవ్వబడును. కాని ఎవరైతే తాను వినిన దానికి లోబడిని వానిగా ఉండునో, అటువంటి వాని యొద్ద నుండి అతడికి కలిగి యున్నదని అనుకొనిన వెలుగును, గ్రహింపును కూడా అతడి యొద్ద నుండి తీసివేయబడును" (లూకా 8:18)


**ఎపఫ్రా మినిస్ట్రీస్ – వనస్థలిపురం**

ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు
వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,
ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.
అందరూ ఆహ్వానితులే....!

వివరములకు:
9666666249 | 040-24202227

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

ప్రార్థన అనునది దేవునికి ఒక మనిషికి మధ్యగల వ్యక్తిగత సంబంధము, అన్యోన్యతను తెలుపు క్రియయై యున్నది. మనము దేవుని కుటుంబమునకు చెందినవారము, క్రీస్తు శరీరమునకు జతపరచబడిన వారము. మరియు మన క్రైస్తవ జీవితపు శక్తి యొక్క భాగము ఇతరులతో మనకి ఉన్న సంబంధములో తెలుస్తుంది. దేవుడు మనలను బలపరచుటకు, సహాయపడుటకు, మనతో కలిసి ఉత్సహించుటకు వారిని ఉపయోగించుకుంటాడు. మన సాంఘిక జీవితములలో ఈ సంబంధములు ప్రాముఖ్యమైనట్లే, మన ప్రార్థనా జీవితములలో కూడా ప్రాముఖ్యమైయున్నవి. కొన్నిసార్లు మనం మన చుట్టూ ఉన్న వారి కొరకు ప్రార్థిస్తాము, కొన్నిసార్లు వారితో కలసి ప్రార్థిస్తాము. మనం వారి కొరకు ప్రార్థించినప్పుడు విజ్ఞాపన ప్రార్థనలు చేస్తున్నాము. వారితో కలసి ప్రార్థిస్తున్నప్పుడు ఒప్పందపు ప్రార్థనలు చేస్తున్నాము. ఈ రెండు రకములైన ప్రార్థనలు అత్యంత శక్తివంతమై యున్నవి గనుక మనం వాటిని అర్థం చేసుకొని, అవి ఎలా ప్రార్థించాలో తెలుసుకోవలసియున్నది.

విజ్ఞాపన ప్రార్థన అనగా మనము ఇతరుల గురించి ప్రార్థించుటయే, ఇది ఇతరులకు బదులుగా వారి అవసరతలను ప్రార్థనలో ఆయన ముందు పెట్టి, మొఱ్ఱపెట్టుట. అనేక మందికి తమ గురించి ప్రార్థించుకొనుట ఎలాగో తెలియదు మరియు ప్రార్థించరు గనుక విజ్ఞాపనా ప్రార్థనా అనునది ప్రార్థనా విధానాలలో అతి ప్రాముఖ్యమైన విధానమైయున్నది. ఎందుకనగా ఎంతో మంది ప్రజలకు ఎలా ప్రార్థించాలి ? ఎందుకు ప్రార్థించాలి? అనే విషయములు తెలియదు, కారణం వారు దేవునితో సంబంధాన్ని కలిగి ఉండరు కాబట్టి. అంతేకాక పరిస్థితులు కష్టమైనవైనా, ఒత్తిడి ఎంతో ఎక్కువైనా, బాధ అధికమైనా అయోమయ స్థితిలో ఉన్నప్పుడు కూడా తమ పరిస్థితిని గూర్చి ప్రార్థించుట ఎలాగో తెలియని వారు కూడా ఉంటారు. మనుష్యులు ప్రార్థించకపోవుటకు లేక ప్రార్థించలేకపోవుటకు అనేక కారణములు ఉంటాయి. కాని మనము ఇటువంటి పరిస్థితులలో ఉన్నవారిని చూచినప్పుడు ఆ పరిస్థితులలోనికి అడుగువేసి, వారికి బదులుగా పరిశుద్ధాత్ముని నడిపింపు ప్రకారము ప్రార్థించుట ప్రాముఖ్యమై యున్నది.


విజ్ఞాపన ప్రార్థన "యాజక" ధర్మమని భక్తులు వ్రాశారు. యేసుయొక్క పరిచర్యలో పాలు పొందుటకు మనుష్యుల కొరకు ప్రార్థించుట ఒక అవకాశమై యున్నది. "తన ప్రజలు మరియు వారి అవసరతల కొరకు యేసు నిరంతరం విజ్ఞాపన చేయుచున్న ప్రకారము మనుష్యుల కొరకు ప్రార్థించుటకు మనము ప్రభువు ఎదుట నిలువబడతాము. నిజానికి ఇది ప్రధానయాజకుని ధర్మములో దేవునితో సహవాసము. మన కుటుంబమునకు,


 మౌనానికి రూపం లేకపోవచ్చు కాని అగ్ని వలె దహించే శక్తి ఉంది.

స్నేహితులకు, సంఘస్తులకు, సమాజమునకు, మన తోటి వారికి మరియు ప్రపంచమునకు మన ప్రార్థనలు అవసరమై యున్నవి. మనము భయంకరమైన దినములలో జీవిస్తున్నాము కనుక ఒకరి కొరకు ఒకరు ప్రార్థించవలసి ఉన్నది. మన విజ్ఞాపన ప్రార్థన మన చుట్టూ ఉన్న వారికి మనమిచ్చే అత్యంత శక్తివంతమైన, అతి విలువైన బహుమానమును, మన జీవితములోనూ, వారి జీవితంలోనూ గొప్ప వైవిధ్యమును కలుగచేయునదై యున్నది. ఒక వ్యక్తి కొరకు ఈ భూమి పైన మనం ఒక్కరమే ప్రార్థిస్తూ ఉండి ఉండవచ్చు. అయితే మన ప్రార్థన ఆ వ్యక్తి జీవితమును మారుస్తుంది.

సందులో నిలుచుండుటను గురించి యెహెజ్కేలు 22:29-31 చెప్తుంది. **మరియు సామాన్య జనులు బలాత్కారము చేయుచు దొంగిలించుదురు, వారు దీనులను దరిద్రులను హింసించుదురు. నేను దేశమును పాడు చేయకుండునట్లు ప్రాకారమును దిట్టపరచుటకును, బద్దలైన సందులలో నిలుచుటకును, తగిన వాడెవడని నేను ఎంత విచారించినను ఒకడైనను కనబడలేదు. కావున నేను నా క్రోధమును వారి మీద కుమ్మరింతును. వారి ప్రవర్తన ఫలము వారి మీదకి రప్పించి నా ఉగ్రతాగ్ని చేత వారిని దహింతును ఇదే ప్రభువైన యెహోవా వాక్కు,** ప్రాముఖ్యంగా దేవుడు చెప్పునది ఏమనగా "ప్రార్థించేవారు కావాలని నేను కనిపెట్టాను ఎవరూ కనబడలేదు గనుక, నేను తప్పని సరిగా దేశాన్ని నాశనము చేయవలసి ఉన్నది" అని అంటున్నాడు. దేశమంతా నాశనము నుండి తప్పించుకొనుటకు ఒక వ్యక్తి కావలసి ఉన్నది. విజ్ఞాపనా ప్రార్థన ఎంత ప్రాముఖ్యమైనదో చూశారా? కేవలం ఒక్క వ్యక్తి దేశమంతటా మరియు ఆ ప్రదేశమంతటా తన ప్రార్థన ద్వారా మార్పు కలుగజేస్తాడు. ప్రార్థించుటకు మనం ఇష్టపడువారమై యుండాలి. మనలను పరిశుద్ధాత్ముడు ప్రార్థనకు నడిపించు సమయమును గుర్తెరిగి, లోబడు వారముగా ఉండాలి. మన ప్రార్థన పరిస్థితులలో మార్పు కలుగ జేయును.

- ఇంకా ఉంది
(సేకరించబడినది)






# బైబిల్ క్విజ్ -43

(రూతు గ్రంథం నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

1. బోయజు తండ్రి ఎవరు?
2. బోయజుకు ఉన్న గుర్తు లేక పేరేమిటి?
3. ఇశ్రాయేలు వంశమును వర్ధిల్లజేసిన ఇద్దరు స్త్రీలు ఎవరు?
4. కరువు కాలములో బేత్లెహేము నుండి మోయాబు దేశమునకు వెళ్ళిన కుటుంబమును పేర్కొనండి?
5. ఎందువలన మునుపటి సత్ప్రవర్తన కంటె వెనుకటి సత్ప్రవర్తన మరి ఎక్కువైనది?
6. బోయజు, రూతుల కుమారుడు ఎవరు?
7. "యెహోవా నాకు విరోధియాయెను" అని ఎవరు ఎవరితో అన్నారు?
8. "ఏమి తెలిసి పరదేశినైన నాయందు లక్ష్యముంచునట్లు నీకు కటాక్షము కలిగెను" ఎవరు ఎవరితో అనెను?
9. ఇశ్రాయేలీయులలో ప్రతి సంగతిని స్థిరపరచుటకు పూర్వమున జరిగిన మర్యాద ఏది?
10. ఆరు కొలల యవలు ఎవరు, ఎవరికి ఇచ్చెను?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు డిసెంబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జనవరి 2016 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 42 జవాబులు (న్యాయాధిపతుల నుండి ఇవ్వబడినవి) :**

**1.** ఏతాము (15:8) **2.** సమ్సోను (16:30)
**3. సీసెరాతో (5**:20) **4.** మీకా కుమారుడు (17:5)
**5. షమ్గరు (3**:30) **6.** యెఫ్తా (11:39)
**7. అదోనీబెజకు (1**:7) **8. ఏహూదు (3**:15)
**9. మానోహ ( 13**:22) **10.** తిమ్నాతు (14:5,6)

గత సంచిక బైబిల్ క్విజ్ 42 లో
3. ఎవరికి - ఎవరితో
9.నిర్భయముగా - నిశ్చయముగా
తప్పు పడినవి క్షమించగలరు..

**బైబిల్ క్విజ్ - 42 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

జీవకుమారి, విఠల్, సుశీల, ఐజాక్‌కుమారి

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## నవంబర్ - డిసెంబర్

**భాగ్యలత** : సత్యవతి, శ్రీలక్ష్మి, సుధాజ్వాల, రూత్‌సరళ, విజయలక్ష్మి, జానకి, శారద, సుధారాణి, విష్ణు, ఉదయ్, అనిష్‌ప్రశాంత్, భానుప్రకాష్, చంద్రసాయి, హెప్సిబా, గౌతమి, దివ్యజ్యోతి, వనితారాణి, వాసన్, సాయికిరణ్, హైమ, మేఘన, మణి, ఈశ్వర్రావు, భాను, ప్రజ్ఞ, ప్రవీణ్, మౌనిక, ఎలీషా, నిఖిల్ సూరజ్ మాథ్యూస్, రమణమ్మ, ప్రవల్లిక, రామకృష్ణ, అభిషేక్, శ్వేత, కిరణ్‌కుమారి, కనికరమ్మ, రూప, సుందర్, స్ఫూర్తి, థామస్, సుఖేషిణి, భవ్యదీపిక, గీత, ప్రసాద్, శౌరి, రమేష్, మహేందర్, రాణి, పుష్పలత, శారమ్మ, సుజాత, ప్రసన్న, సృజన, శృతి, బాలజ్యోతి, అవినాష్, రాంబాబు, తర్షీనా, మాధవి, రాజ్‌కుమార్, లూధియ, అమూల్య, ప్రేమ్‌కుమార్, దుర్గాప్రసాద్, సువార్తమ్మ, శ్రీకాంత్, సాల్మన్‌రాజు, శిరీషభాను, కిన్నెరమేరి, అక్షయ్, సతీష్, హేమంత్ కుమార్, భాగ్యలక్ష్మి, జ్యోతి, చంటిబాబు, సురేందర్, నవీన్, ఫిన్నీనోవెల్, కరుణ, అనిల్‌బాబు, ఉపేంద్ర, అశ్వని, శోభారాణి, విజ్ఞత, గౌతమి, సత్యదుర్గాసుప్రజ,ఆశీర్వాదం, చంద్రశేఖర్, కృష్ణవేణి, కార్తీక్, ప్రవీణ, దుర్గేష్‌నందిని, రాజేశ్వరి, రాధిక.

**చింతల్ :** రాజ్‌కిరణ్, శశాంక్, మార్గరేట్, దానియేల్, వెంకటేశ్వర్రావు, నాగేశ్వర్రావు, కుమారి, సుహాసిని, పావని, దివ్యజ్యోతి, సాల్మన్, ఎస్తేరురాణి, మంజుల, లక్ష్మారెడ్డి

**అనాజ్‌పూర్ :** స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్, సంజీవ్, నీలిమ, కిరణ్, మరియమ్మ, థామస్ పీటర్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227


2015, అక్టోబర్ 2వ తేదీన జరిగిన ఉపవాస ప్రార్థనలో
పాల్గొనిన దేవుని ప్రజలు

## 2015, అక్టోబర్ 2వ తేదీలో జరిగిన
## ఉపవాస ప్రార్థనలో పాల్గొనిన విశ్వాసులు





# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249

email: mail2church@gmail.com | web: www.epaphra.org

---

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras